మనిషిలో దానవత

శ్రీ ధాయిపులె బాలకృష్ణారావు

అర్ధరాత్రి కావస్తోంది మునిసిపాలిటి దీపము గుడ్డిగ వెలుగుతోంది. దీపపు వెలుతురు ప్రకాశవంతముగ లేనందువల్ల, పదడుగుల పరిసరాన్ని మాత్రమే కాంతి చీకటిని ఛేదించి, ఆ స్థలాన్ని తాను ఆక్రమించుకొంది. ఆ దీపపు స్తంభము నాలుగుదార్లు కలిసేచోటవున్నా వెలుతురు పరిమితమనే చెప్పాలి. నిశ్శబ్దము నిశాదేవి వొడిలో నిరాటంకముగ నిద్రపోతుందనే కాబోలు కుక్కలు అప్పుడప్పుడు, అక్కడక్కడ, "బొవ్వు" మని మొరగడమువల్ల ఆ ధ్వని గాలిలోకలిసి, పరిసరాన్నంతా తుఫానులాగ అలుముకొనేది. ఆ ప్రదేశమంత నిర్మానుష్యముగ వుంది.

సందు మలుపులో ఒక చిన్నగుడిసె చుట్టు తడికలతో కట్టబడి, తాటాకులతో గోపురమువలె కప్పబడివున్న ఆ గుడిసెలోపల ఒకమూలన మట్టితో కట్టబడిన నాలుగడుగుల యెత్తుటి గోడ. ఆ గోడమీద ఒకదీపము కాంతివిహీనమైన వెలుగును విరజిమ్ముతోంది. ఆ గోడమీదనే ఒకమూలన చిన్న మురళి విగ్రహము సగము చీకటితో, సగము వెలుతురులో కప్పబడివుంది. ఆ గుడిసెలో ఒకభాగాన నులకమంచముమీద చిరిగిన దుప్పటి సగమువరకు కప్పబడివున్న దీనదయాళుడు సన్నగ మూల్గుతున్నాడు. మట్టినేలమీద కూర్చొని తన తొడలపై తలవుంచి నిద్రపోతున్న సీతను యెడమచేత్తో జోకొట్టుతు, కుడిచేతితో మంచముపై పడుకొనివున్న దీనదయాళుని హృదయముపై నిమురుతు కునికిపాట్లు తీస్తోంది ముప్పయియేళ్ళ వయస్సుతో నిండిన ముగ్గురు పిల్లల తల్లి నీలవేలు. చాలీచాలక, అక్కడక్కడ చిరిగిపోయివున్న ఈతచాపమీద మూడేళ్ళ సుబ్బులు తల్లిప్రక్కనే నిద్రపోతోంది.

కునికిపాట్లుతీస్తు నిద్రపోతున్న నీలవేలు దీనమైన వదనములో పదునాలుగేళ్ళ దుఃఖపూరితమైన అనుభవము గూడుకట్టుకొని వుందా అనిపిస్తుంది. నీలవేలు బక్క-చిక్కి వుంది. ముఖములో కళ లేనేలేదు. సంసారజీవితములో దిగేముందు ఆమె వదనములో ఎంతోకళ వుట్టిపడుతుండేది. సుఖజీవనాన్ని గడుపాలని పెళ్ళి అయినదినాల్లో దేవుణ్ని కోరుతుండేది. అయితే, స్వానుభవములో తను కోరుకున్నదానికి విపరీత ఫలితాలను చవిచూసింది.

ఎప్పుడూ తన పిల్లల సుఖము భర్త సుఖము కాంక్షిస్తు వుండేది. భర్తకెన్నోసార్లు చెప్పిచూసింది. త్రాగుడు మానుకోమని, రాత్రులు ఎక్కడికి వెళ్ళవద్దని. తిప్పన్న అవేమి పట్టించుకోలేదు. పైగా చితకదన్నేవాడు. అతని కోపతాపాలకు నోరెత్తేది కాదు. కూలిడబ్బులు తీసుకొచ్చి కాస్తాకూస్తా యిచ్చి వెళ్ళేవాడు. ఆ డబ్బుతో నీలవేలు గంజియో, సంకటి అన్నమో వండి తనపిల్లలు, తానూ తినేవారు. డబ్బు యివ్వనిరోజుల్లో మజ్జిగత్రాగి పస్తుండేవాళ్ళు. ఇలాగె రోజులు గడుచుక వెళ్ళాయ్.

గుడిసెలో చీకటి వెలుగులతోపాటు నిశ్శబ్దము గూడ ఆవరించుకొని వుంది. ఆ నిశ్శబ్ద వాతావరణము అలా ఎంతసేపుండి పోయిందో, ఆ గుడిసెలోవుండే మానవుల కెవ్వరికి తెలియదు.

దీనదయాళుడు సన్నగ మూల్గడము ప్రారంభించాడు.

వాకిలి కిర్రుమనే శబ్దముతో మూలుగు కంఠధ్వని క్షీణించిపోయింది. గుడిసెలో పరివృతమైన నిశ్శబ్దము మాయమైపోయింది. ముగ్గురు స్త్రీలు లోపలకు వచ్చారు. అందరు నిద్రలో పడివున్నారు.

"అమ్మా! నీలమ్మ! లేవమ్మ పిల్లాడు మూలుగుతున్నాడు" అంది రామమ్మ.

అంకాలమ్మ నీలవేలు భుజముమీద తట్టుతు, "లేవే! నీలవేలు. అలా నిద్రపోతున్నావు. ఎప్పటినుంచి మూలుగుతున్నాడో కద. వినబడ్డంలే... లే... లే. పసికందు బాధపడుతుంటేను" అంది.

శాంతమ్మ దీనదయాళుని చేతిని పట్టుకొని డాక్టరులాగ చూసింది. "అబ్బే జ్వరమేమి లేద. పిల్లాడు నీరసంగా వున్నాడు. అంతే." అంటూ "ఏం, బాబు ఏం కావాలి? నీళ్ళు తాగుతావా. మా బాబు మంచోడె. సంక్రాంతికి మీ బాబుతో చెప్పి మంచి మంచి బట్టలు కుట్టించుకో. మనమందరము దేవా

ఆడే ఆటకు పోదాము...” అంటూ దీనదయాళుని తల నిమురుతు కుష్కించిపోయిన ముఖము వేపు జాలిగ చూస్తూ నిలబడింది.”

“ఏమె, నీలవేలు. నీ మొగుడింక రాలేదేమే. ఏం పోగాలమోనమ్మ. బంగారంలాంటి పిల్లల్ని, భార్యని యిడిచి ఎక్కడంటె అక్కడ పడుంటాడు.” అంటూ ముక్కుమీద వ్రేలిడుకుంది నలభై యేళ్ళ ముత్తైదువ రామమ్మ.

“ఏమోనమ్మ భార్యాపిల్లలుండే మొగాళ్ళు చీకటి పడకముందె యిల్లు చేరుకోవాలి” అంకాలమ్మ అందుకుంది.

దీనదయాళుడు నీరసముగ ఏదో గొణగడము వినిపించింది. అది అస్పష్టముగ వుంది. దగ్గరలోవుండే శాంతమ్మ అడిగింది.

“ఏం బాబు! ఏం కావాలి?”

“అమ్మా! ఆకలిగ వుందే. కడుపు తిప్పుతోంది.” కంఠములో బాధ స్పష్టమవుతోంది. కనురెప్పలు బరువుగ ఎత్తి అమ్మ వేపు చూశాడు. నీలవేలు కళ్ళు తడి అయ్యాయ్. చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటు, అక్కడినుండి లేచి, ఒక పాత్రలోని గంజిని తెచ్చింది. దీనదయాళుడు అది చూచి,

“ఎప్పుడు ఆ వుప్పుగంజేనేమే. నాకొద్దు పో.”

“నామాట యిను. దీన, ఇది కొంచెము యేసుకో నోట్లో. మా నాయిన గదు నే. కొంచెము...” అంటు బలవంతముతో రెండు గుటికెలు త్రాపించింది. నిట్టూర్చింది నీలవేలు.

“ఏమి మొగుడమ్మ తన ఆరోగ్యము నూసుకోడు. పిల్లల సుకము నూసుకోడు. తెచ్చేడబ్బులు యెవరికో అంటబెడతాడు” రామమ్మ అంది.

“జానే తల్లి! ఏం కాలమె. యిపరీతముగ మారి మనసుల్ని మాయదారి పట్టిస్తుందా ప్చ...ప్చ... తెచ్చే డబ్బుతోనె అయ్య-అప్ప రామచంద్రో అనుకుంటు లచ్చనంగ దేవుడ్ని స్మరనం సేసుకుంటు పిల్లల్ని సూసుకుంటు వుండొచ్చునె” అంకాలమ్మ అంది.

ఈ విధముగ నలుగురిలో నాలుగు మాటలనిపించుకోవడం కొత్తకాదు. వాళ్ళు చెప్పుకునే విషయాల్ని వింటు మనసులో బాధపడేది నీలవేలు.

ఈ అలజడికి సుబ్బులు, సీను లేచికూర్చున్నారు. అర్థముకాని చూపులతో అమ్మ వేపు చూస్తుండి పోయారు.

శాంతమ్మ యిప్పుడే వస్తానని చెప్పి, ముంతలో మజ్జిగ వేసుకవచ్చింది. “తలాయింత తాగండ్రా” అంటూ దీనదయాళుని కిచ్చింది.

నీలవేలు తన విధికి చాల విచారపడుతు, వచ్చిన వారు తమపై ప్రేమ చూపడమువల్ల వాళ్ళను మనసులో అభినందించుకుంది.

“ఇంక నిద్ర పొండ్రా” అంది శాంతమ్మ.

వచ్చినవారు ముగ్గురు వస్తామమ్మ అంటూ సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

“ఏం ఖర్మనే యిది. ఎప్పుడూ యింతె” పోతూ ఒకామె గొణిగింది.

“యిది వ్రాతనే తల్లి” అంది శాంతమ్మ.

“ఏం మొగుడే మనిషైతేనా.”

ముగ్గురు పిల్లలు మేను వాల్చారు. నీలవేలు కంట తడిపెడుతూ, ఏవో తలచుకుంటూ అశాంతిగ నిట్టూరుస్తు మగతనిద్రలో పడ్డది.

◆ ◆ ◆

“ఏయ్ రంగసాని! ప్రపంచమంత మాయేపిల్ల. నూలేందె నాకు పపంచము సూన్యమె. తెలిసిందా పిల్లా!” అంటూ రంగసానిని దగ్గరకు లాక్కున్నాడు. బాగుగ వన్నెచీరతో అలంకరించుకొని, సహజత్వాన్నంత పోగొట్టుకున్న వన్నెలాడి రంగసాని తిప్పన్న బాహువుల్లో యిమిడిపోయింది.

“ఏంటి సారాయివాసన - కంపు. హు,” మూతి ప్రక్కకు తిప్పుకొంది.

“ఏంటే అలా కూత్తవ్. అమృతమే యిది. అమృతము” అంటూ బుగ్గమీద ముద్దెట్టుకున్నాడు. రంగసాని ఏమనలేదు.

“రేపు నీకో మాంచిచీరె తెత్తాను. నాకేమిత్తావ్ చెప్పు.” తిప్పన్న రంగసానిపై వుండె వ్యామోహంతో అడిగాడు.

“తీసుకురా మొదట. తీసుకొచ్చినప్పుడు కద. నువ్వెంత మంచి చీర తీసుకొస్తే అన్ని ముద్దులు ఎక్కువ”... అంటూ చిరునవ్వు చిలికించింది. నిషాలోవుండే తిప్పన్న అదోరకంగ నవ్వాడు.

“నా... పిల్ల... ఉంటే నీలాంటోల్లే వుండాలి. నాలాంటోల్లను ఉద్ధరిస్తారు” అన్నాడు. రంగసానిని వదిలేసాడు.

“సరేపిల్ల. రేపటికి ఖాయం. వత్తామరి” అంటూ కన్నుగీటాడు. తిప్పన్న ఆ ప్రపంచమునుండి బయట

పడుతున్నాడు. కూలిపనిచేసి, రోజంత కష్టపడి సంపాదించిన డబ్బు - డబ్బంటే విలువ తెలియని తిప్పన్న, తాను సంపాదించినదంత హారతి కర్పూరంలా ఆ రోజే రంగసానికి అర్పించాడు. ఇది మాములుగ రోజూ చేసెపనే.

ఆ వూరిలో తనకు తెలిసిన, తెలిసిన వారనుకున్న వాళ్ళు తిప్పన్నకు శతవిధాల చెప్పేవారు. అయిన, అతనికి అవేమి ఒంటబట్టలేదు. మంచికిపోతె మూర్ఖుడు అనిపించుకున్నట్లు, ఎవరైన తిప్పన్న దగ్గరికి పోయియో, లేక అతనిని పిలిచియో

"తిప్పన్నా, భార్యపిల్లలు గలవాడివి. అంతో యింతో బాధ్యత అంటే ఏమిటో తెలిసికొని వుండాలి. అటుభార్య పస్తుగవుంటు, యిటు- పిల్లలు అన్నమో రామచంద్ర అంటూ ఏడుస్తుంటే.. ఏమిటి తిప్పన్న యిది—నానావస్థలం పెడుతున్నావ్ అందరిని. అట్లా కాకుంటె, పెళ్ళైన చేసుకోకుండ వుండాలి" అని చెబితే

"చాల్లేవయ్యా. బోసెప్పొచ్చావ్ పెద్ద మనిషి లాగ. నాయిట్టమొచ్చినట్టు చేత్తా, నువ్వోరివి." అంటూ జాబ్బా పుడవడము అలవాటు తిప్పన్నకు. ఇంకొకసారి, ఆ వూరిలోవుండె ఒకటీచరు తిప్పన్నకు ఏదో నచ్చచెప్పాలనుకున్నాడు.

"తిప్పన్నా" అంటూ బుర్రమీసాలు మెలివేసుకుంటూ పోయె తిప్పన్నను పిలిచాడు. తిప్పన్న ఎంతో నమ్రత ప్రకటిస్తు పంతులు దగ్గరికి వచ్చాడు.

"ఏం బాబు పిలిసారు."

"చూడు తిప్పన్న, పిల్లలకేవో కొంచు బట్టలు కుట్టియ్యాల్సింది. చిరిగిపోయిన బట్టలతో అసహ్యంగా వస్తున్నారు. నీత్రాగుడు కొద్దిగ మానెయ్. మీ నాన్న గారున్నపుడు మంచిపేరు తెచ్చుకొన్నారు. నువ్వుచాల మారిపోయావు. ఇంట్లో అందరు ఆకలితో బాధపడుతుంటేను, నువ్వేమో సాని . "

"చాల్లేవయ్యా. నీవు, నీ సోద. సిన్నపిల్లలకు సెప్పినట్టు సెప్పుతున్నావు. ఏదొలె, అయ్యవారు సెప్పుక పోనీలె అని వూరుకుంటె యింకా సెప్పుక పోవడమేన. పాఠాలు సెప్పేవాడివి, సెప్పేంతవరకే వుండాలి. హద్దులు మీరిపోతే" అంటూ కన్నుబుస్సు మన్నాడు తిప్పన్న. టీచరుగారికి ఎక్కడలేని కోపము ముంచుకవచ్చింది. అయితే ఏమియు అనలేకపోయాడు. అప్పటినుండి టీచరుగారు తిప్పన్నను పిలువడముగాని, ఏదైన చెప్పడముగాని మానేశారు. ఇలాగె, ఎందరో తిప్పన్నను మంచిగ వుండమని చెప్పుతుండేవాళ్ళు. కాని, అందరు పరాజితులయ్యారు. తిప్పన్నంటే అందరికీ ఒకవిధమైన భయము. అతని విగ్రహముతో పాటు స్వభావము యితరులను భయం కలుగజేస్తుంది.

◆ ◆ ◆

రంగసాని యింటినుండి బయటపడ్డాడు తిప్పన్న. 'అప్పన్నా తనామన - మావూరి భైరన, మనమాటంటె — పాదలన్నా, మారుజెప్పితే మక్కెలిరుగ తంతామన్న, మంచిగవుంటె మనమూరకుంటామురా అన్న - ఓరన్న'— బూరమీసాలు మెలివేసుకుంటు, తప్పత్రాగిన తిప్పన్న తూలుతు, నోటికి వచ్చినది పాడుకుంటు చీకటిని చుట్టుకొని, చీకటిలోనే తప్పటడుగులు వేసుకుంటు ముందుకు పోతున్నాడు. వీధిలోని మునిసిపాలిటి లాంతరులో కిరసనాయిలు అయిపోవడమువల్ల దీపము అప్పుడో, యిప్పుడో ఆరిపోయె స్థితిలోవుంది. తిప్పన్నను చూసి దారిప్రక్కన పడుకొనివున్న కుక్క మొరిగింది. "ఛా! ఏమిటే అలా రొదసేస్తవ్. నీ అబ్బగంటు పోయిందా? ఇస్, గస్ చిప్, అరిసావ అడి దగ్గరికి పోతావ్." మూతలు పడుతున్న కళ్ళతో చూసి, నిసాలో చెప్పాడు. తిప్పన్న మాటలకు ఖాతరుచేయక కుక్క యింక గట్టిగ మొరగడం ప్రారంభించింది. "ఏయ్. ఛుప్. నువ్వా నాకు తోడయ్యావ్. నాకు నీలాంటోల్లు సాలమంది వున్నారులే" అంటూ కుక్క భాష అర్థం చేసుకున్నవాడిలా తిరుగుజవాబు చెప్పాడు. తిప్పన్న కంటే తన బ్రతుకే నయమనుకొని కాబోలు కుక్క అరవడము మానివేసి ఓ మూలన పోయి పడుకొంది.

తిప్పన్న నానావస్థలపడి గమ్యం చేరుకున్నాడు. గుడిసె చీకటిగ వుంది. వాకిలి కిర్రున తెరుచుకుంది. తిప్పన్న లోపలికి ప్రవేశించాడు. దట్టముగ అలుముకొనివున్న చీకటిలో కంటికి ఎవరు కనబడడము లేదు. మెల్లిగ వెక్కి వెక్కి ఏడుస్తున్న గొంతు అస్పష్టంగ వినబడింది.

"ఛీ ఏమిటీ రొద, ఎప్పుడు యింతే. కొంపకు వస్తే ఏడ్పుతో ప్రారంభము కత (కథ). ఏయ్ నీలి ఎక్కడ సచ్చావ్" తిప్పన్న గర్జించాడు. కళ్ళనీళ్ళు తుడుచుకొని. దీపము అంటించింది నీలివేలు. సారాయి వాసన గుప్పున కొడుతుంది. గుడిసెఅంతా ఆ వాసనతో నిండిపోయింది.

(603 వ పేజీ చూడుడు)

(565 వ_పేజీ తరువాయి)

కాళ్ళు చేతులు కడుక్కోవడానికి నీళ్ళు అందించింది నీలివేలు.

"కూడుపెట్టు" అరుస్తు కూర్చున్నాడు తిప్పన్న. నీలివేలు ఏమని సమాధానం చెప్పాలో తెలియక కళ్ళ నీళ్ళు పెట్టింది.

"ఏమిటే నీ నాటకం.- కూడుపెట్టవే అంటే అలా నిలబడ్డావ్ దయ్యంలాగు". తిప్పన్నకు నిసాలో ఏమి అర్థంకాలేదు.

కోపము పెల్లుబికిపోయింది. మీసాలు తిప్పుతూ కొంపకు సస్తే, పిడికెడు బువ్వ పుట్టదు. పస్తుపెట్టి సంపాలనుకొంది" ... తిప్పన్నలో ఆవేశము తగ్గలేదు. కళ్ళు యెర్రగ వున్నయ్. చివాలునలేచి వొళ్లు తెలియని కోపముతో నీలవేలును కొట్టాడు. అసలే సన్నగ, నీరసంగవుండే నీలవేలు యీ దెబ్బలతో కూలిపోయింది. బలమైన దెబ్బలు తగలడంవల్ల ఒక్కసారి పెద్దమూల్గుతో నేల రాలిపోయింది. ఎక్కడో నక్కలు అరిచిన శబ్దముతో లీనమైన నీలవేలు కంఠము భయంకర తమస్సులో కలిసిపోయింది

సినీ వార్తలు - విశేషాలు

చిత్రపు నారాయణమూర్తిగారి దర్శకత్వాన గాయత్రీవారి 'కృష్ణకుచేల' చిత్రం వడివడిగా నిర్మించబడుతున్నది. ఇందులో సి. యస్. ఆర్., అబ్బూరి వరప్రసాదరావు మున్నగువారు నటిస్తున్నారు. రచన పద్మరాజు.

♦ ♦ ♦

'దేవుడు చేసినమేలు' చిత్రమును నాట్యభారతీ ప్రొడక్షన్స్‌వారి తరఫున డా॥ రాజారావు నిర్మించ పూనుకున్నారు. ఇందులో డాక్టరుగారు లక్ష్మియనే నూతన నటిని పరిచయం చేస్తున్నారు.

♦ ♦ ♦

రాణు పిక్చర్సువారి 'నిత్యకల్యాణం పచ్చతోరణం' చాలవరకు నిర్మాణమయిందట. ఇందులో చలం, కృష్ణకుమారి, సి. యస్. ఆర్., గుమ్మడి, సంధ్య, రామలింగయ్య మొదలగువారు నటిస్తున్నారు. పినిశెట్టివారి దర్శకత్వము. పెండ్యాల సంగీతము.

♦ ♦ ♦

మహేంద్రవారి 'కృష్ణప్రేమ' చిత్రనిర్మాణం సాగుతున్నది. ఇందులో 'మనోరమ' ఫేమ్ బాలయ్య కృష్ణుడుగా నటిస్తున్నాడు. ఇంకా జమున, రేలంగి, పద్మనాభం మొదలగువారు నటిస్తున్నారు. సంగీత దర్శకత్వం పెండ్యాలవారిది.

♦ ♦ ♦

'జాల్ సాజ్' చిత్రం ఆధారంగా హైదరాబాద్ మూవీస్ వారు 'జల్సారాయుడు' చిత్ర నిర్మాణమునకు పూనుకున్నారు. ఇందులో జగ్గయ్య, జమున, ముక్కామల మున్నగువారు నటిస్తున్నారు. తాపీ చాణక్య దర్శకత్వము.

'బొబ్బిలి యుద్ధం'

ఆంధ్ర విజ్ఞానసమితి (రిజిస్టర్డ్) వారు మద్రాసు వాణీమహలులో యీనెల 13వ తేదీనాడు 'బొబ్బిలి యుద్ధం' నాటకమును ప్రదర్శించారు. రంగారావుగా శ్రీ ఎ. వి. సుబ్బారావు, విజయరామరాజుగా శ్రీ చదలవాడ గోపాలకృష్ణ, మల్లమ్మగా కుమారి డి. సుజాత పేర్కొనతగినట్లుగా నటించారు. బుస్సీ, పాపారాయుడు భూమికలు సయితం ఒప్పించినవి.

ఈ చారిత్రాత్మక నాటకం ప్రదర్శించడంలో ఆంధ్ర విజ్ఞానసమితివారు విశేషంగా ప్రయాసపడవలసి వచ్చినా నాటకం ప్రేక్షకుల మన్ననల నందుకున్నది.

పది, పదిహేను సంవత్సరాలుగా నాటకాలు ఆడుతూ కళాసేవనే ప్రధానంగా కలిగియున్న యీ సమితికి స్థిరమైన స్థావరము, ఆర్థిక సౌష్టవము ఏర్పడకుండుట చాల విచారకరము. మద్రాసు నగరంలోని తెలుగువారు, మద్రాసేతరాంధ్రులు పూనుకున్నచో ఏనాడో ఆంధ్ర విజ్ఞానసమితికి అన్నిహంగులు అమరియుండవలసినది. చలనచిత్ర రంగంలోని ప్రముఖులు సహకరించి సహాయము చేసినచో ఆంధ్ర విజ్ఞానసమితి ఉత్తమ కళాకేంద్రంగా రూపొందగలదు.

శ్రీ లింగమూర్తిగారు చెప్పినట్లు రసికులు, అభిమానులు సహకరించి సహాయపడిననేకాని ఏ కళకాని పోషింపబడి వర్థిల్లజాలదు. అంజలీ పిక్చర్స్ అధినేత శ్రీ ఆదినారాయణరావుగారి అపార అనుభవ విశేషాలు, అండదండలు సమితికి లభించగలవని ఆశిస్తున్నాం.

— పున్నయ్య